సాక్షి
విశాఖపట్నం
మంగళవారం | 21 | ఫిబ్రవరి | 2023



సత్వరమే అర్జీల పరిష్కారం
స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను కాలపరిమితిలోగా పరిష్కరించాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. 8లో



డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్
సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పోజు మధుసూదనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. 8లో



గ్రాండ్‌గా గ్రాంటు
ఉమ్మడి విశాఖ జిల్లాలోని 4,944 పాఠశాలలకు రూ.2.36 కోట్లు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 8లో

న్యూస్‌రీల్

సీఎం జగన్‌కు ధన్యవాదాలు



సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పంచకర్ల రమేష్‌బాబు

మహారాణిపేట : మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులను శాసనమండలి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల వైఎస్సార్ సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు సంతోషం వ్యక్తం చేశారు. సోమవారం తాడేపల్లిలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని ఆయన మర్యాద పూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కనకమహాలక్ష్మి హుండీ ఆదాయం రూ.37.89 లక్షలు



నగదు లెక్కిస్తున్న సిబ్బంది

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి దేవస్థాన హుండీల ఆదాయం లెక్కింపు సోమవారం చేపట్టారు. గత నెల 7 నుంచి ఈ నెల 20 వరకు హుండీల ద్వారా రూ.37 లక్షల 89 వేల 624 వచ్చినట్లు ఈవో కె.శిరీష తెలిపారు. అలాగే 95 గ్రాముల 400 మిల్లీగ్రాముల బంగారం, 749 గ్రాముల వెండి, యూఎస్‌ఏకి చెందిన 165 డాలర్లు, ఒమన్ దేశానికి చెందిన 100 బైసాలు, కువైట్‌కు చెందిన 184 దినార్లు, ఒమన్ దేశానికి చెందిన 1 రియల్, సింగపూర్‌కు చెందిన 2 డాలర్లు వచ్చాయని పేర్కొన్నారు. ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, శ్రీహరిసేవా సంఘం సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు



కేంద్ర కారాగారంలో మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి బులికృష్ణ

ఆరిలోవ (విశాఖ తూర్పు): రిమాండ్ ఖైదీలు న్యాయ సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి కె.కె.బులికృష్ణ తెలిపారు. న్యాయ సేవాధికారి సంస్థ సభ్యులతో కలిసి సోమవారం ఆయన విశాఖ కేంద్ర కారాగారాన్ని సందర్శించారు. ఖైదీల బ్యారక్‌లు, ఆస్పత్రి, వంటశాల పరిశీలించారు. ఖైదీలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. బెయిల్ మంజూరైనప్పటికీ జామీను ఇవ్వడానికి ఎవరూ ముందుకు రాకపోవడంతో ఇబ్బంది పడుతున్న రిమాండ్ ఖైదీలతో ఆయన నేరుగా మాట్లాడారు. ఈ సందర్భనలో జైల్ అధికారులు, సంస్థ సిబ్బంది రమణి, కాశీ, పారా లీగల్ వలంటీర్ నూకరత్నం ఉన్నారు.

గాజువాక హౌస్ కమిటీ భూముల క్రమబద్ధీకరణకు జీవో

గాజువాక : దీర్ఘకాలంగా గాజువాకలో పెండింగ్‌లో ఉన్న భూముల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం జీవో నంబర్ 71ను జారీ చేసింది. ఈ భూముల క్రమబద్ధీకరణకు గతంలో జారీ చేసిన జీవో నంబర్ 301 ప్రకారం మంజూరు చేసిన పట్టాలకు కొత్తగా డీడ్‌లను జారీ చేయనున్నారు. పట్టాలు పొందని వారికి ఇతర జీవోల ప్రకారం క్రమబద్ధీకరణ పట్టాలు జారీ చేసేందుకు చర్యలు చేపడతారు. కొత్త జీవో జారీపై గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్ర పటానికి మంగళవారం క్షీరాభిషేకం చేయనున్నట్టు ఆయన తెలిపారు.

ఆస్పత్రి నుంచి ఇద్దరు ఉద్యోగులు డిశ్చార్జి

ఉక్కునగరం: ప్రమాదంలో గాయపడి నగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరు స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు సోమవారం డిశ్చార్జ్ అయ్యారు. ఈనెల 11న స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్–2లో జరిగిన ప్రమాదంలో నలుగురు ఉద్యోగులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం నగరంలోని ఆస్పత్రిలో చేర్పించారు. ఈనెల 12న ఒక కాంట్రాక్టు కార్మికుడు, 14 మరొక కాంట్రాక్ట్ కార్మికుడు డిశ్చార్జ్ అయ్యారు. విభాగం సీనియర్ మేనేజర్ టి.జయకుమార్, టెక్నీషియన్ ఈశ్వర నాయక్‌లు కోలుకోవడంతో వారిని డిశ్చార్జ్ చేశారు. ఇంకా ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

సీ ఫుడ్‌తో స్నాక్స్!

- చేపలు, రొయ్యలు, పీతలతో తయారీ
- కో బ్రాండింగ్ పేరిట ప్రభుత్వం ప్రోత్సాహం
- రూ.10, 20, 50 లక్షలతో ఔట్‌లెట్ల ఏర్పాటుకు రాయితీలు
- ఫిష్ ఆంధ్ర'లో ఇప్పటికే తాజా చేపల విక్రయాలపై ఫోకస్



పెందుర్తిలో ఏర్పాటు చేసిన కో బ్రాండింగ్ స్నాక్స్ ఔట్‌లెట్

సాక్షి, విశాఖపట్నం: తాజా చేపలను నేటి తరానికి రుచికరమైన స్నాక్స్ రూపంలో ఆరగించే ఔట్‌లెట్లు అందుబాటులోకి వస్తున్నాయి. వీటిలో చేపలు, రొయ్యలు, పీతలు వంటి వాటితో తయారైన పలు రకాల స్నాక్స్ లభ్యమవుతాయి. ఇలాంటి (కో బ్రాండింగ్) ఔట్‌లెట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే సముద్ర చేపల వినియోగాన్ని పెంచే లక్ష్యంతో ఇప్పటికే ఫిష్ ఆంధ్ర పేరిట ప్రభుత్వం తాజా చేపల విక్రయంపై ఫోకస్ పెట్టింది. ఈ ఫిష్ స్నాక్స్ ఔట్‌లెట్ల ఏర్పాటుకు హైదరాబాద్‌కు చెందిన బెస్ట్ ఫ్రెష్ ఫ్రెస్ (బీఎఫ్ఎఫ్) అనే సంస్థ కో–బ్రాండింగ్ పార్టనర్‌గా వ్యవహరిస్తుంది. ఇందుకు అవసరమైన స్మార్ట్ కిచెన్, కాంబి ఓవెన్, కాంబి ఫ్రీజర్, ఫ్రై స్టేషన్, ప్లాట్‌ఫాం తదితర సామగ్రిని, ముడి సరకును బీఎఫ్ఎఫ్ సమకూరుస్తుంది. ఈ సంస్థ మత్స్య శాఖతో కలిసి లబ్ధిదార్ల ఎంపికను చేపడుతుంది. లబ్ధిదార్లకు సీ ఫుడ్ స్నాక్స్ తయారీ, ఔట్‌లెట్ల నిర్వహణపై శిక్షణ ఇస్తుంది. స్నాక్స్ మెనూ ధరలను నిర్ణయిస్తుంది. ఎప్పటికప్పుడు కొత్త రకాల రుచులను పరిచయం చేస్తుంది. మార్కెటింగ్, వ్యాపార ప్రచారం వంటివి కూడా ఈ సంస్థ చూస్తుంది. రూ.10 లక్షలు (డైలీ ఫార్మాట్), 20 లక్షలు (సూపర్ ఫార్మాట్), 50 లక్షల (లాంజ్ ఫార్మాట్) శ్రేణుల్లో సీ ఫుడ్ స్నాక్స్ ఔట్‌లెట్లను ఏర్పాటు చేసుకునే వీలుంది. వీటిలో రూ.10 లక్షల ఔట్‌లెట్‌కు రూ.80 వేలు, రూ.20 లక్షలకు రూ.84 వేలు, రూ.50 లక్షల ఔట్‌లెట్‌కు రూ.90 వేలు చొప్పున బీఎఫ్ఎఫ్‌కు ఫ్రాంఛైజీ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. అలాగే నెల అమ్మకం సొమ్ములో డైలీ ఫార్మాట్‌కు రూ.6,250 లేదా 2.5 శాతం, సూపర్‌కు రూ.12,500 లేదా 2.5 శాతం, లాంజ్‌కు రూ.18,750 లేదా 2.5 శాతం ఏది ఎక్కువైతే అది లబ్ధిదారుడు రాయల్టీగా చెల్లింపులు జరపాలి.

ఔత్సాహికుల ఆసక్తి

ఈ సీ ఫుడ్ స్నాక్స్ కో బ్రాండింగ్ ఔట్‌లెట్ల ఏర్పాటుపై ఔత్సాహికులు ఆసక్తి కనబరుస్తున్నారు. విశాఖకు దాదాపు 40 యూనిట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే పెందుర్తిలో ఒక ఔట్‌లెట్ ఏర్పాటైంది. ఇది రెండ్రోజుల్లో ప్రారంభం కానుంది. రూ.10 లక్షల యూనిట్ల కోసం తొమ్మిది, రూ.50 లక్షల యూనిట్లకు మూడు, రూ.20 లక్షల యూనిట్లకు రెండు కో బ్రాండింగ్ ఔట్‌లెట్ల ఏర్పాటు కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతలను బట్టి కలెక్టర్ వీటిని మంజూరు చేయనున్నారు. మరోవైపు బీచ్‌రోడ్డులో ఒకటి, జగదాంబ జంక్షన్‌లో మరో హోటల్‌నూ, మధురవాడలో ఫిష్ ఆంధ్ర యూనిట్లకు అనుబంధంగా సీ ఫుడ్ స్నాక్స్ యూనిట్ల ఏర్పాటుకు అనుమతులిచ్చారు. వీటిలో మధురవాడ యూనిట్‌లో సీ ఫుడ్ స్నాక్స్ అందుబాటులో ఉంచారు. మరోవైపు సీ ఫుడ్ స్నాక్స్ ఔట్‌లెట్ల ఏర్పాటు చేయాలనుకునే వారికి ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. మహిళలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు 60 శాతం, జనరల్ కేటగిరీ వారికి 40 శాతం చొప్పున సబ్సిడీ ఇస్తోంది.



అందుబాటులో ఉండే స్నాక్స్

ఈ ఔట్‌లెట్లలో ఫ్రెంచ్ ఫ్రైస్, బెల్జియం ఫ్రైస్, క్రంచీ ఫ్రైస్, నాకోస్, క్రంచీ క్రాబ్, క్రంచీ ష్రింప్స్, చికెన్ ఫింగర్స్, చికెన్, రొయ్యలు, పన్నీరు, బ్రకోలీ, ఎగ్‌తో తయారైన కబాబ్‌లు, రోల్స్, పన్నీరు, వెజీ, కార్న్, చీజ్, చాక్‌లేట్, చికెన్‌లతో వండిన మొమోస్, వివిధ రకాల పిజాలు, బర్గర్లు అందుబాటులో ఉంటాయి. వీటితో పాటు వివిధ రుచుల ఆయుర్వేద టీలు, ఫిల్టర్ కాఫీలు, ఐస్‌క్రీంలు, మిల్క్ షేక్‌లు, బేక్‌డ్ స్నాక్స్ వంటివి కూడా లభ్యమవుతాయి.

నేటి తరానికి భిన్నరుచుల స్నాక్స్



సీ ఫుడ్ స్నాక్స్ ఔట్‌లెట్లలో భిన్నమైన రుచుల్లో వండిన స్నాక్స్ అందుబాటులో ఉంటాయి. నేటి తరానికి ఈ విభిన్న రుచులు ఎంతగానో ఆకట్టుకుంటాయి. పైగా సీ ఫిష్‌తో తయారైనవి కాబట్టి ఆరోగ్యానికి మేలు చేస్తాయి. చేపల వినియోగం పెంచేందుకు ప్రభుత్వం ఇలాంటి యూనిట్ల ఏర్పాటుకు ముందుకొచ్చే వారికి రాయితీలిచ్చి ప్రోత్సహిస్తోంది. వీటి ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకునే వారికి అర్హతలను బట్టి మంజూరు చేస్తాం.

– జి.విజయ, జిల్లా మత్స్య శాఖ అధికారి

అక్రమ వ్యాపారానికి అడ్డాగా గణేష్ రైస్ మిల్లు!

- ఇటీవల బియ్యం లోడుతో లారీ పట్టివేత
- ఉన్నతాధికారుల అనుమతి లేకుండా వదిలేసిన డీటీ, వీఆర్వో
- ఇద్దరినీ సస్పెండ్ చేస్తూ కలెక్టర్ మల్లికార్జున ఉత్తర్వులు



పద్మనాభం(భీమిలి): మండలంలోని అనంతవరంలో నిర్వహిస్తున్న శ్రీ గణేష్ మోడరన్ రైస్ మిల్లులో అనధికార బియ్యం వ్యాపారం జరుగుతోందనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. ఇటీవల బియ్యంతో లారీ రెవెన్యూ అధికారులకు చిక్కడం ఈ ఆరోపణలకు మరింత బలం చేకూర్చింది. ఈ మిల్లు యాజమాన్యం పీడీఎస్ బియ్యం తక్కువ ధరకు కొని అధిక ధరలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో ఈ నెల 15న మిల్లులోని బియ్యం లారీలోకి లోడ్ చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న డీటీ కె.శ్యామల, మద్ది వీఆర్వో టీఎస్ఏఎస్ ఉమామహేశ్వరరావు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అవి పీడీఎస్ బియ్యమా..?, రైతులకు చెందినవా..? తెలుసుకునేందుకు విశాఖపట్నం ల్యాబ్‌కు శాంపిళ్లు పంపించారు. ఆ నివేదిక వచ్చేంత వరకూ బియ్యం లారీని వదలొద్దని శ్యామల, ఉమామహేశ్వరరావును తహసీల్దార్ కోరాడ వేణుగోపాలరావు ఆదేశించారు. అయితే ఆ ఆదేశాలను బేఖాతరు చేస్తూ టెస్టింగ్ రిపోర్టు రాకముందే వీరిద్దరూ బియ్యంతో ఉన్న లారీని వదిలేశారు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ మల్లికార్జున డీటీని, వీఆర్వోనూ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ల్యాబ్ నివేదికలో బియ్యం మూడు నుంచి ఆరు నెలలుగా నిల్వ చేసినవిగా నిర్ధారించినట్టు విశ్వసనీయ సమాచారం. నిల్వ బియ్యం కావడంతో అవి పీడీఎస్ బియ్యమే అని ఉన్నతాధికారులు నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దీన్నిబట్టి ఈ మిల్లులో పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారం జోరుగా సాగుతున్నట్టు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. కొంత కాలం నుంచి గుట్టుగా సాగుతున్న ఈ వ్యవహారం వల్ల భారీగా బియ్యం తరలిపోయినట్టు భావిస్తున్నారు.

కేజీహెచ్ డైట్ టెండర్ల ఎంపిక పూర్తి

మహారాణిపేట: కేజీహెచ్‌లో రోగులకు, డాక్టర్లకు రోజూ ఆహారం సరఫరా చేయడం కోసం దాఖలు చేసిన టెండర్ల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. 11 మంది డైట్ దరఖాస్తులు తీసుకుని 9 మంది మాత్రమే టెండర్లలో పాల్గొన్నారు. వారిలో నలుగురిని అర్హులుగా గుర్తించారు. జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ఆధ్వర్యంలో డిస్ట్రిక్టు డైట్ మేనేజ్‌మెంట్ కమిటీ టెండర్లను క్షుణ్ణంగా పరిశీలించి ఎస్.శ్రీనివాసరావు, కె.వీరన్న, కె.సురేష్, వై.కోటీశ్వరరావును ఎంపిక చేశారు. ఒక్కొక్క కాంట్రాక్టర్ ఆరు నెలల చొప్పున నలుగురూ రెండు సంవత్సరాలపాటు పని చేస్తారు. ఆ తర్వాత వచ్చే ఒక ఏడాదికి ఎవరి పని తీరు బాగుంటే వారిని ఎంపిక చేయాలని నిర్ణయించినట్టు కేజీహెచ్ వర్గాలు తెలిపాయి.

విశాఖలో గంజాయి లేదు

- ఒడిశా రాష్ట్రం కోరాపుట్ నుంచే నగరానికి రవాణా
- ఇక్కడి నుంచి రోడ్డు, రైలు మార్గాల ద్వారా ఇతర రాష్ట్రాలకు తరలింపు
- అటువంటి వారిపై నిఘా పెట్టి రవాణాను అడ్డుకుంటున్నాం
- జిల్లాలో డ్రగ్స్, గంజాయి ఉన్నాయనడం దుష్ప్రచారమే
- స్పష్టం చేసిన పోలీస్ కమిషనర్ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): విశాఖలో గంజాయి, డ్రగ్స్ ఉన్నాయంటూ చేస్తున్న దుష్ప్రచారాల్లో వాస్తవం లేదని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తేల్చి చెప్పారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పక్క రాష్ట్రాల్లో ఉన్న గంజాయిని ఇతర రాష్ట్రాలకు తరలించడానికి విశాఖను కేవలం ట్రాన్సిట్‌గా మాత్రమే వినియోగించుకుంటున్నారని స్పష్టం చేశారు. విశాఖలో రోడ్డు, రైలు మార్గాల ద్వారా రవాణా సదుపాయాలు ఉండడంతో డ్రగ్ పెడలర్లు ఒడిశా, మన్యం జిల్లాల నుంచి గంజాయిని విశాఖకు తీసుకొస్తున్నట్లు చెప్పారు. అటువంటి అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠాపై నగర పోలీసులు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నిఘా పెట్టి రవాణాను అడ్డుకొని వారిని అరెస్టు చేస్తున్నట్లు వివరించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

- గత ఏడాది కాలంలో 388 కేసుల్లో 6,459 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. 852 మంది నిందితులను అరెస్టు చేశారు.
- ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ గంజాయికి ప్రధాన కేంద్రంగా ఉంది. అక్కడి నుంచి విశాఖ మీదుగా గంజాయి రవాణా చేస్తున్న సమయంలో విశాఖ పోలీసులు గుర్తించి 77 కేసులు నమోదు చేసి 4,604 కిలోలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న 6,459 కిలోల గంజాయిలో ఇది 71.3 శాతం.
- ఇతర రాష్ట్రాల నుంచి విశాఖ మీదుగా 2,880 కిలోలు ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, ఢిల్లీ, బిహార్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తెలంగాణకు రవాణా చేస్తుండగా పట్టుకున్నారు.
- పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా ఇప్పటి వరకు 247 మంది ఇతర రాష్ట్రాల డ్రగ్ పెడ్లర్లను అరెస్ట్ చేశారు.
- అలాగే 5,131 పెంటాజోసిన్ ఇంజెక్షన్లు, 11,114 సెడెక్టివ్ మాత్రలు, 85 ఎల్ఎస్‌డీ బ్లాట్‌లు, 2 కిలోల నల్లమందు, 126.2 గ్రాముల ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. పెంటాజోసిన్ ఇంజెక్షన్ల ప్రధాన నిందితుడు పశ్చిమ బెంగాల్‌కు చెందిన అనుపమ్ అధికారిని కూడా అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.
- ప్రభుత్వ స్థలాలు, విద్యా సంస్థల వద్ద 146 హోర్డింగ్‌లు ఏర్పాటు చేసి, ముఖ్యమైన జంక్షన్లలో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.
- యూనివర్సిటీలు, పలు విద్యా సంస్థల్లో 252 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.
- సుప్రా వాహనంతో ఆడియో – వీడియో విజువల్స్ ప్లే చేస్తూ జిల్లా అంతటా ప్రచారం చేస్తున్నారు.
- నగరంలో 202 మంది డ్రగ్స్ వినియోగదారులను గుర్తించి కేజీహెచ్‌లో ఉన్న డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ల ద్వారా కౌన్సెలింగ్ ఇస్తున్నారు.
- సింథటిక్ డ్రగ్ కేసుల్లో నగరంలో 85 మంది డ్రగ్స్ యూజర్లను గుర్తించి కౌన్సిలింగ్ ఇచ్చి డీ అడిక్షన్ సెంటర్‌కు వెళ్లాలని సూచించారు.

'పసికందు' ఘటనలో స్టాఫ్‌నర్స్ సస్పెన్షన్

ఇద్దరు సెక్యూరిటీ గార్డుల తొలగింపు

మహారాణిపేట: కేజీహెచ్ నుంచి పసికందు మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తండ్రి తీసుకొని వెళ్లిన ఘటనపై ప్రాథమిక విచారణ చేసిన కమిటీ నివేదికను కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్‌కు అందజేసింది. ఈ మేరకు ఆయన క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఆ సమయంలో విధులు నిర్వర్తిస్తున్న స్టాఫ్‌నర్స్ కృష్ణవేణిని సస్పెండ్ చేశారు. పసికందు మృతదేహాన్ని తరలిస్తున్నప్పుడు గమనించడంలో వైఫల్యం చెందిన సెక్యూరిటీ గార్డు కనకమహాలక్ష్మి, అవుట్ గేట్ సెక్యూరిటీ గార్డు నాగరాజును విధుల నుంచి తొలగించాలని సాయి సెక్యూరిటీ ప్రైవేటు లిమిటెడ్ వారిని ఆదేశించారు. అలాగే గిరిజన రోగులను మోనటరింగ్ చేయడంలో వైఫల్యం చెందిన ట్రైబుల్ సెల్ సిబ్బందిపై క్రమశిక్షణ చర్యల కోసం ఐటీడీఏ పీవోకు నివేదికను సమర్పించినట్లు సూపరింటెండెంట్ అశోక్‌కుమార్ తెలిపారు. కమిటీ సభ్యులు డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ సోమవారం విచారణ నిర్వహించారు. స్టాఫ్ నర్సు నుంచి ట్రైబల్ సెల్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంలో జాప్యం జరగడం, తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వడంలో సమన్వయం లోపించిందని విచారణలో గుర్తించారు.

స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మహారాణిపేట : జిల్లాలో, నగరంలో నిర్వహిస్తున్న ఆస్పత్రుల్లోని క్లినిక్స్, ల్యాబ్‌లు, స్కానింగ్ కేంద్రాలు, ఫెర్టిలిటీ కేంద్రాలు తప్పనిసరిగా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ – 2002 ప్రకారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేని వాటిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆస్పత్రులు, క్లినిక్స్, ల్యాబ్‌ల నిర్వాహకులు https://clinicalesttact.ap.gov.inలో, స్కానింగ్ కేంద్రాల కోసం https:// pcpndt.ap.gov.inలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని 27 కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 2,021 మంది హాజరు కాగా, 139 మంది గైర్హాజరైనట్లు ఆర్ఐవో పి.ఉమారాణి తెలిపారు. అదేవిధంగా మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షకు 1,716 మంది విద్యార్థులు హాజరుకాగా, 57 మంది గైర్హాజరయ్యారు. తొలి రోజు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. విశాఖ నగరంలోని పవిత్ర ఒకేషనల్ జూనియర్ కాలేజీ, శంకర్ ఫౌండేషన్ జూనియర్ కాలేజీల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ఆర్ఐవో ఉమారాణి తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా కేంద్రాల నిర్వాహకులు తగిన శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

విశ్వసనీయత.. విధేయత



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కోలా గురువులు



కుంభా రవిబాబును అభినందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

కోలా గురువులు

ఎమ్మెల్యే కోటాలో ఎంపిక చేసిన అభ్యర్థి

మత్స్యకార (వాడబలిజ) సామాజిక వర్గానికి చెందిన గురువులు 2009లో రాజకీయాల్లో ప్రవేశించారు. ప్రజారాజ్యం పార్టీ తరఫున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. 2012లో వైఎస్సార్‌సీపీలో చేరారు. 2014 ఎన్నికల్లో పార్టీ తరఫున విశాఖ దక్షిణ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయన్ని రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఇప్పుడు శాసనమండలి ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిగా ప్రకటించి మరోసారి మత్స్యకార సామాజిక వర్గానికి పెద్దపీట వేశారు.

డాక్టర్ కుంభా రవిబాబు

గవర్నర్ కోటాలో సిఫార్సు చేసిన అభ్యర్థి

ఆంధ్రాయూనివర్సిటీలో 1989 నుంచి 2004 వరకు ప్రొఫెసర్‌గా పనిచేసిన కుంభా రవిబాబు.. దివంగత మహానేత వైఎస్సార్ ప్రోత్సాహంతో రాజకీయాల్లో ప్రవేశించారు. విజయనగరం జిల్లా ఎస్.కోట నియోజకవర్గం నుంచి 2004లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అసెంబ్లీలో ఎస్టీ లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్‌గా పనిచేశారు. వైఎస్సార్ సీపీలో చేరిన అనంతరం 2019లో పార్టీ అరకు పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులయ్యారు. పార్టీ ఎస్టీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కూడా పనిచేశారు. ప్రస్తుతం ఏపీ ఎస్టీ కమిషన్ తొలి చైర్మన్‌గా సేవలందిస్తున్న రవిబాబును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు.

- బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు ఎమ్మెల్సీ పదవులు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో ఇద్దరికి అవకాశం

సాక్షి, విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లాలో బీసీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన ఇద్దరిని ఎమ్మెల్సీ అభ్యర్థులుగా ప్రకటించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మరోసారి పెద్ద మనసు చాటుకున్నారు. ఎమ్మెల్యే కోటాలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ కోలా గురువులును ఎంపిక చేశారు. గవర్నర్ కోటాలో ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ కుంభా రవిబాబును సిఫార్సు చేశారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వీరిద్దరికీ కీలక నామినేటెడ్ పదవులను అప్పగించిన ముఖ్యమంత్రి.. ఇప్పుడు ఏకంగా చట్టసభకు ఎంపిక చేసి వారికి మరింత మెరుగైన అవకాశం కల్పించారు. ఆవిర్భావం నుంచి పార్టీ ఎదుగుదలకు నిరంతరం కృషి చేసిన కోలా గురువులును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం పట్ల మత్స్యకార, వాడబలిజ సామాజిక వర్గీయులు హర్షం తెలుపుతున్నారు. అదే విధంగా ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మాజీ ప్రొఫెసర్ కుంభా రవిబాబును గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా సిఫార్సు చేయడంపై గిరిజనులు, మేధావులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం జగన్‌కు ధన్యవాదాలు

శాసనమండలిలో బీసీలకు అగ్రపీఠం

మహారాణిపేట: శాసనమండలిలో బీసీలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం పట్ల మేయర్ గొలగాని హరి వెంకట కుమారి హర్షం వ్యక్తం చేశారు. బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారాన్ని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని తెలిపారు. దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి ఇంతటి సాహసమైన నిర్ణయం తీసుకోలేదన్నారు. బీసీలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చరిత్ర తిరగరాశారన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ మల్లికార్జున, డీఆర్వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్‌సాహెబ్

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల మండలి ఎన్నికలకు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పూర్తి స్థాయిలో చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మల్లికార్జున రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనాకు వివరించారు. వచ్చే నెల 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో సీఈవో సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించి సమస్యలుంటే వాటిని తమకు తెలియజేస్తే వాటిని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపిస్తామని తెలిపారు. ఓటర్ల నమోదు, తిరస్కరణలు, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు, కౌంటింగ్ సెంటర్స్ ప్రతిపాదనలు, బ్యాలెట్ బాక్సులు సంసిద్ధత, బ్యాలెట్ పేపర్ల ప్రింటింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మల్లికార్జున మాట్లాడుతూ పూర్తిస్థాయిలో బ్యాలెట్ బాక్సులు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. క్లెయిమ్‌లకు సంబంధించిన ప్రక్రియ పూర్తయిందని, డూప్లికేట్ ఓటర్ల తొలగింపు కూడా పూర్తిచేశామన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి , ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

సత్వరమే అర్జీల పరిష్కారం

- ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ ఆధారిత హాజరు తప్పనిసరి
- జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్



వీల్‌చైర్‌లో వృద్ధురాలు, దివ్యాంగుడిని కలెక్టరేట్‌లోకి తీసుకెళ్తున్న సిబ్బంది

మహారాణిపేట: స్పందన కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్దిత కాలపరిమితి లోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగులో ఉన్న పిటీషన్లు వెంటనే పరిష్కరించాలన్నారు. పిటీషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ అర్జీలు తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. అదేవిధంగా అర్జీదారుని సమస్య పరిష్కరించిన అనంతరం సంబంధిత సచివాలయ సిబ్బంది వారి ఇంటికి వెళ్లి సదరు ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.

23న జెడ్పీ సర్వసభ్య సమావేశం

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు అందరూ ముఖ ఆధారిత యాప్‌లో రోజూ హాజరు వేయాలని జేసీ ఆదేశించారు. ఈ నెల 23న జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తామని, అందుకు సంబంధిత అధికారులు హాజరు కావాలని జేసీ విశ్వనాథన్ ఆదేశించారు. అదే రోజున వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు స్పందన అర్జీల పరిష్కారంపై జిల్లా అధికారులకు శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి 167 అర్జీలు స్వీకరించారు. వినతులు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వచ్చే దివ్యాంగులు, వృద్ధుల కోసం జిల్లా యంత్రాంగం వీల్‌చైర్లు ఏర్పాటు చేశారు. ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, అధికారులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద నుంచి రక్షణ కల్పించండి

ఆనందపురం మండలం రామవరం గ్రామంలో సర్వే నెంబరు 126 నుంచి 128 వరకు, 130/1, 131/2లో పేర్కొన్న నా భూమిని మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకుడు పీలా గోవింద సత్యనారాయణ ఆక్రమించారని వెలుగోటి మురళీ యాచేంద్ర ఆరోపించారు. కుటుంబ విభజన దస్తావేజు ప్రకారం వచ్చిన భూమిని కేర్ టేకర్‌గా బైరాగి రాజుకు ఇచ్చానని, రాజుతో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ కుమ్మక్కై నా భూముల రికార్డులను తారుమారు చేశారని, దీనిపై న్యాయం చేయాలని కోరారు.

పోలీస్ స్పందనకు 33 ఫిర్యాదులు

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 33 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ (క్రైం) జి.నాగన్న, ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) డి.గంగాధర్, ఏసీపీ (ఎస్‌బీ) గోవిందరావుతోపాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

డబ్బు కోసమే రియల్టర్ కిడ్నాప్

- రౌడీషీటర్ హేమంత్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు
- వారితోపాటు మొత్తం 11 మందిని అరెస్ట్ చేసిన పోలీసులు
- రూ.7.75 లక్షలు, 11 ఫోన్లు, 2 కార్లు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీకాంత్

దొండపర్తి (విశాఖ దక్షిణ): సంచలనం సృష్టించిన రియల్టర్ కొప్పోజు మధుసూదనరావు కిడ్నాప్ కేసును పీఎం పాలెం పోలీసులు ఛేదించారు. కిడ్నాపర్ కోలా వెంకట హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లతోపాటు మొత్తం 11 మందిని సోమవారం అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ తెలిపారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. నెల రోజుల క్రితం బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన హేమంత్ కుమార్ డబ్బు కోసమే మధుసూదనరావును కిడ్నాప్ చేసినట్లు వెల్లడించారు. అతడి వద్ద నుంచి రూ.11.75 లక్షలు తీసుకోగా... కిడ్నాపర్లలో ఒకరికి డబ్బులు ఇస్తానని చెప్పి, అతడి సహకారంతో కిడ్నాపర్ల చెర నుంచి మధుసూధనరావు తప్పించుకొని ఈ నెల 17వ తేదీన పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కేసును ఛేదించినట్లు వివరించారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం..

పెద రుషికొండ ప్రాంతానికి చెందిన కొప్పోజు మధుసూదనరావు స్టాక్ ట్రేడింగ్‌తోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి 2020లో భీమిలికి చెందిన రౌడీషీటర్ కోలా వెంకటహేమంత్ కుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఇరువురూ కొన్నాళ్లు రియల్ ఎస్టేట్ లావాదేవీలు సాగించారు. హేమంత్‌కుమార్‌పై గతంలో కూడా కిడ్నాప్ కేసు ఉండగా... గంజాయి కేసులో అరెస్ట్ అయి గత నెల 13నే బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చాడు. ఇదిలా ఉంటే మధుసూదనరావుకు చెందిన ఒక విల్లాను ఇటీవల విక్రయానికి పెట్టాడు. ఈ విషయం తెలుసుకున్న హేమంత్‌కుమార్ అతడిని కిడ్నాప్ చేయాలని నిర్ణయించుకున్నాడు.

జైలులో పరిచయమైన కానిస్టేబుళ్లతో కలిసి..

మధుసూదనరావు కిడ్నాప్ ప్లాన్‌కు ఇద్దరు కానిస్టేబుళ్లు మన్యం జిల్లాకు చెందిన జీరెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లా ఎస్.కోటకు చెందిన కానిస్టేబుల్ బింపోలు రాంబాబు సహకరించారు. వీరిద్దరూ గంజాయి కేసులో అరెస్టయి జైలుకు కూడా వెళ్లి ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్నారు. హేమంత్ కుమార్ కూడా గంజాయి కేసులో అరెస్టవడంతో జైలులోనే కానిస్టేబుళ్లతో పరిచయం ఏర్పడింది. బయటకు వచ్చాక హేమంత్‌కుమార్ వారితోపాటు దువ్వాడ పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉన్న గంధవరపు తరుణ్‌కుమార్(32), మరో ఏడుగురికి మధుసూధనరావు గత నెల 28న పెద రుషికొండలో కిడ్నాప్ ప్లాన్ చెప్పాడు. ఇందులో ఒక్కొక్కరికి రూ.లక్ష ఇస్తానని చెప్పి, అడ్వాన్స్‌గా రూ.5 వేలు చొప్పున ఇచ్చాడు.

విల్లా కొనుగోలుకు పార్టీ ఉందని నమ్మించి...

విల్లా కొనుగోలుకు తన వద్ద పార్టీ ఉందని మధుసూధనరావును హేమంత్‌కుమార్ నమ్మించాడు. 15వ తేదీన పార్టీని కలుద్దామని చెప్పడంతో మధుసూధనరావు ఆ రోజు ఉదయం తన కారులో బాలాజీ బే మౌంట్ రోడ్డుకు వెళ్లాడు. అక్కడ హేమంత్ కుమార్ మరో ఇద్దరు ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్న(19)తో కలిసి కారులో వేచి ఉన్నాడు. అక్కడి నుంచి నలుగురు కారులో బయలుదేరారు.

కాళ్లు.. చేతులు కట్టేసి..

కొంత దూరం వెళ్లేసరికి ప్రసాద్, చిన్న కలిసి మధుసూధనరావు కాళ్లు, చేతులు కట్టేసి అతని వద్ద ఉన్న బంగారం గొలుసు, 2 ఉంగరాలు కాజేశారు. నగర శివారు ప్రాంతంలో ఉన్న ఒక లే అవుట్‌కు తీసుకెళ్లి హేమంత్‌కుమార్ రూ.30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అంత డబ్బు తన వద్ద లేదని, తన ఐసీఐసీఐ బ్యాంక్ అకౌంట్‌లో ఉన్న రూ.4 లక్షలను హేమంత్ కుమార్ అకౌంట్‌కు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ డబ్బులు సరిపోవని మరో రూ.8 లక్షలు ఇవ్వాలని హేమంత్ డిమాండ్ చేశాడు. దీంతో మధుసూధనరావు ఈ నెల 16న తన భార్య వద్ద ఉన్న బంగారు నగలను తన స్నేహితుడు జగదీష్ ద్వారా బ్యాంకులో తాకట్టుపెట్టి డబ్బులు ఇప్పించాడు. అలాగే మధుసూధనరావు చైన్, ఉంగరాలను ఎస్.కోటలో ఉన్న మణప్పురం, ముత్తూట్ ఫైనాన్స్‌లో తాకట్టు పెట్టి రూ.1.8 లక్షలు తీసుకున్నారు.

కిడ్నాపర్లలో ఒకరి సాయంతో బయటపడి...

మధుసూదనరావు డబ్బులు ఇచ్చినప్పటికీ అతడిని కిడ్నాపర్లు విడిచిపెట్టలేదు. హేమంత్‌కుమార్‌తో పాటు మరికొంత మంది బయటకు వెళ్తూ మధుసూదనరావుకు కాపలాగా ఒకరిని పెట్టారు. వారు వెళ్లిన వెంటనే కాపలాగా ఉన్న వ్యక్తికి డబ్బులు ఇస్తానని, తనను పంపించేయాలని కోరడంతో అతడు వదిలేశాడు. దీంతో మధుసూదనరావు వారి చెర నుంచి బయటపడి ఈ నెల 17న పీఎం పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ప్రత్యేక బృందాల దర్యాప్తుతో 11 మంది అరెస్ట్

మధుసూదనరావు ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు డీసీపీ - 1 సుమిత్ సునీల్ గరుడ కేసును స్వయంగా పర్యవేక్షించారు. 10 బృందాలను ఏర్పాటు చేసి కిడ్నాపర్ల కోసం గాలించారు. మధుసూదనరావు బ్యాంక్ ఖాతా నుంచి నగదు ట్రాన్స్‌ఫర్ చేసిన ఖాతాల వివరాలు, ఇతర సాంకేతికతతో కిడ్నాపర్లను పోలీసులు గుర్తించారు. అసలు కిడ్నాపర్ హేమంత్‌కుమార్ ఇక్కడి నుంచి హైదరాబాద్ వెళ్లి అక్కడి నుంచి గోవాకు పారిపోయాడు. పోలీసులు ఒక్కొక్కరిని అదుపులోకి తీసుకొని విచారించగా హేమంత్ కుమార్‌తోపాటు మొత్తం 11 మంది కిడ్నాప్‌కు పాల్పడినట్లు గుర్తించారు. దీంతో కోలా హేమంత్‌కుమార్, ఎస్.కోటకు చెందిన పాండ్రంకి ప్రసాద్(31), అనకాపల్లికి చెందిన గుడపర్తి చిన్నా(19), కేడీ పేటకు చెందిన సుర్ల నాగ గణేష్(21), దొండపర్తికి చెందిన దమ్ము శరత్‌తేజ(21), దమ్ము సాగర్ శ్రీనివాస్(22), మన్యం జిల్లాకు చెందిన జెరెడ్డి అప్పలనాయుడు, విజయనగరం జిల్లాకు చెందిన బింపోలు రాంబాబు, వడ్లపూడికి చెందిన గంధవరపు తరుణ్‌కుమార్(32), అనకాపల్లికి చెందిన బలిరెడ్డి నానాజీ(25)లను సోమవారం అరెస్ట్ చేశారు. గంధవరపు తరుణ్‌కుమార్ బ్యాంక్ ఖాతా నుంచి రూ.7.75 లక్షలు, 2 కార్లు, 11 మొబైల్ ఫోన్లు, రెండు జతల పోలీస్ యూనిఫాం స్వాధీనం చేసుకున్నారు. హేమంత్‌కుమార్‌పై ఇప్పటికే 8 కేసులు ఉన్నాయని, అతడిపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు తీసుకుంటామని సీపీ శ్రీకాంత్ చెప్పారు. అలాగే కిడ్నాపర్ హేమంత్‌కుమార్‌కు సహకరించిన ఇద్దరు కానిస్టేబుళ్లు అప్పలనాయుడు, రాంబాబుపై కూడా రెండేసి కేసులు ఉన్నట్లు వివరించారు.



స్వాధీనం చేసుకున్న నగదు, ఫోన్లు

సీపీ శ్రీకాంత్ అభినందన

కిడ్నాప్ కేసును ఛేదించి కిడ్నాపర్లను అరెస్టు చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ అభినందించారు. నార్త్ ఏసీపీ సీహెచ్.శ్రీనివాసరావు, పీఎంపాలెం సీఐ వై.రామకృష్ణ, భీమిలి సీఐ కె.లక్ష్మణమూర్తి, ఎస్‌ఐలు సీహెచ్.వెంకటరావు, ఎన్.సునీత, ఎ.హర్ష, బి.నరసింహమూర్తి, ఇతర నార్త్ సబ్ డివిజన్ సిబ్బందిని ప్రశంసించారు.

సమాచారం సిద్ధం చేయండి

సంబంధిత అధికారులకు కమిషనర్ రాజాబాబు ఆదేశం

డాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో కమిషనర్ పి.రాజాబాబు నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 48 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వారం స్పందనలో స్వీకరిస్తున్న ఫిర్యాదులకు సంబంధించి వాటి వివరాలను వచ్చే వారం నిర్వహించే గ్రీవెన్స్ నాటికి సిద్ధంగా ఉంచాలని, ఆ సమస్య ఏ స్థాయిలో ఉందో తెలపాల్సిన బాధ్యత అధికారులదేనని తెలిపారు. సమస్య పరిష్కారం కాలేదని ఫిర్యాదుదారుడు మరలా వస్తే అందుకు తగు వివరణ ఉండాల్సిందేనని చెప్పారు. గ్రీవెన్స్‌లో వచ్చే ప్రతీ ఫిర్యాదుకి సంబంధించిన వివరాలు సంబంధిత అధికారులు ముందుగా తెలుసుకుని సమాచారం సిద్ధం చేయాలని ఆదేశించారు. వినతులు పరిశీలించి 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి, కమిషనర్ రాజాబాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, డీసీ (రెవెన్యూ) ఫణిరాం, రీజినల్ ఫైర్ ఆఫీసర్ సీహెచ్ కృపావాసం, ఎఫ్ఏ అండ్ ఏవో మల్లికాంబ, డీపీవో చంద్రిక, యూసీడీ పీవో సూర్యకళ పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సౌత్‌ఈస్ట్రన్ రైల్వే ఖరగ్‌పూర్ డివిజన్ పరిధిలో జరుగుతున్న ఆధునికీకరణ పనుల నిమిత్తం ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఏకే త్రిపాఠి ఓ ప్రకటనలో తెలిపారు.

రద్దయిన రైళ్లు

- సంత్రగచ్చి-మంగుళూరు(22851) ఈ నెల 23, మార్చి2, మంగుళూరు - సంత్రగచ్చి(22852) ఈ నెల 25, మార్చి 4, షాలిమార్-చెన్నై(22825) ఈ నెల 28, చెన్నై - షాలిమార్ (22826) మార్చి 1, హౌరా-బెంగళూరు (12245) దురంతో ఈ నెల 28, మార్చి 1,3,4,5, బెంగళూరు - హౌరా(12246) దురంతో మార్చి 2,3,5, సికింద్రాబాద్-హౌరా(12704)ఈనెల 28, మార్చి 2,3,5, హౌరా-సికింద్రాబాద్(12703) ఫలక్‌నుమా ఈనెల 28, మార్చి 2,3,5, తిరుపతి - హౌరా (20890)హమ్‌సఫర్ ఈనెల 26, మార్చి 5, హౌరా -తిరుపతి(20889)హమ్ సఫర్ ఈనెల 25, మార్చి 4, బెంగళూరు-హౌరా(12864) ఫిబ్రవరి 26,28, మార్చి2వ తేదీ నుంచి 5వ తేదీ వరకు రద్దు చేశారు.
- హౌరా-బెంగళూరు(12863) ఈనెల 28, మార్చి 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు, బెంగళూరు-జసిద్ది(22305) ఈ నెల 26, మార్చి 5, జసిద్ది - బెంగళూరు(22306) ఈ నెల 24, మార్చి 3, బెంగళూరు-అగర్తలా(12503) హమ్‌సఫర్ ఫిబ్రవరి 28, మార్చి 3, అగర్తలా-బెంగళూరు(12504) హమ్‌సఫర్ మార్చి 5, విల్లుపురం-ఖరగ్‌పూర్(22604) ఈ నెల 28, ఖరగ్‌పూర్-విల్లుపురం(22603)మార్చి 2, సికింద్రాబాద్-డిబ్రూఘడ్(07046) మార్చి2, బెంగళూరు-హౌరా(22888) మార్చి2, హౌరా-బెంగళూరు(22887) ఈనెల 28, హైదరాబాద్-షాలిమార్(18046) మార్చి 3,5, షాలిమార్ - హైదాబాద్(18045)మార్చి 5,6, సత్యసాయిప్రశాంతి నిలయం -హౌరా (22832) మార్చి3, హౌరా -సత్యసాయి ప్రశాంతి నిలయం (22831) మార్చి 1, కన్యాకుమారి-డిబ్రూఘడ్(15905) మార్చి 2, డిబ్రూఘడ్-కన్యాకుమారి(15906)ఈనెల 28, సికింద్రాబాద్ - గౌహతి (12513) మార్చి4, గౌహతి-సికంద్రాబాద్(12514) మార్చి 2, విల్లుపురం-పురూలియా (22606) మార్చి4, పురూలియా-విల్లుపరం(22605) మార్చి6, సంత్రగచ్చి- తిరుపతి (22855) మార్చి5, తిరుపతి-సంత్రగచ్చి మార్చి 6, హౌరా-బెంగళూరు (22863) మార్చి6, బెంగళూరు -హౌరా (22864) మార్చి 8 తేదీలలో రద్దు చేశారు.
- దారి మళ్లించిన రైళ్లు

బెంగళూరులో ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు బయల్దేరే బెంగళూరు-హౌరా (12246) దురంతో ఎక్స్‌ప్రెస్ మళ్లించిన మార్గంలో వయా కటక్, జరోలి, రాజ్‌కర్‌స్వన్, టటానగర్, ఖరగ్‌పూర్ మీదుగా నడుస్తుంది.

చోరీ కేసులో పోలీసులకు చిక్కిన మైనర్లు?

తగరపువలస (భీమిలి): భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆరు మాసాల క్రితం జరిగిన దొంగతనాలకు సంబంధించి మైనర్లను ఇక్కడి పోలీసులు విచారిస్తున్నారు. చిట్టివలస సుభీభవ కాలనీ వద్ద అపార్ట్‌మెంట్, అనిట్స్ కళాశాల పరిసర ప్రాంతాల్లో ల్యాప్‌టాప్, తులాల కొద్దీ బంగారు ఆభరణాల చోరీలో వీరి పాత్ర ఉన్నట్టు సమాచారం. ద్విచక్ర వాహనం ప్రమాదం కేసులో పట్టుబడిన నిందితులు ఈ చోరీలకు పాల్పడినట్టు పోలీసులు గుర్తించారు. భీమిలి జోన్ రెండో వార్డుకు చెందిన ఒక గ్రామంలోని వ్యక్తికి చోరీ చేసిన బంగారు ఆభరణాలు కారుచౌకగా విక్రయించడం, మరికొన్ని ఆభరణాలు దుకాణంలో విక్రయించినట్టు వార్తలు సోమవారం సాయంత్రం గుప్పుమన్నాయి. మరి కొన్ని తులాల బంగారు ఆభరణాలు తగరపువలసలోని ప్రైవేట్ బ్యాంకులో అక్కడి ఉద్యోగుల సాయంతో తాకట్టు పెట్టినట్టు కూడా పోలీసులు గుర్తించారు. ఆభరణాలు, ల్యాప్‌టాప్ చోరీకి గురైన గ్రామాలు, వాటిని కొనుగోలు చేసిన వ్యక్తుల గ్రామాలు పక్కపక్కనే ఉండడంతో ఎవరూ నోరు మెదపడం లేదు. దీనిపై నగరానికి చెందిన క్రైం విభాగం పోలీసు ఉన్నతాధికారులు మంగళవారం పూర్తి వివరాలు వెల్లడించనున్నారు. మొత్తం చోరీకి గురైన బంగారు ఆభరణాలు 60 తులాల వరకు ఉంటాయని వినిపిస్తున్నా ఇక్కడి పోలీసులు ధ్రువీకరించడం లేదు.

గ్రాండ్‌గా గ్రాంటు

ఉమ్మడి విశాఖ జిల్లాకు రెండో విడత రూ.2.36 కోట్లు మంజూరు

విశాఖ విద్య: ప్రభుత్వ స్కూళ్ల నిర్వహణకు నిధులు మంజూరయ్యాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని 4,944 పాఠశాలలకు రూ.2.36 కోట్లు విడుదల చేస్తూ సమగ్ర శిక్ష డైరెక్టర్ సురేష్ కుమార్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల వారీగా నిధులు కేటాయింపు చేశారు. వీటిని పాఠశాలల బ్యాంకు ఖాతాలో జమ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా సమగ్ర శిక్ష అధికారులకు ఆదేశాలు అందాయి. 2022-23 విద్యా సంవత్సరానికి తొలి విడతలో గత ఆగస్టులో ఉమ్మడి విశాఖ జిల్లాలోని 4,090 స్కూళ్లకు రూ.2.24 కోట్లు మంజూరయ్యాయి. సాంకేతిక కారణాలతో తొలివిడతలో కొన్ని పాఠశాలలకు నిధులు జమకాలేదు. ఇలాంటి వాటికి సైతం రెండో విడతలో నిధులు కేటాయింపు చేశారు. రెండో దఫా నిధులు సైతం సకాలంలోనే మంజూరు చేయటం పట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాల వారీగా మంజూరైన నిధుల వివరాలు

జిల్లా	పాఠశాలలు	నిధులు (రూ.లక్షల్లో)
విశాఖపట్నం	579	39.22
అనకాపల్లి	1,467	78.47
అల్లూరి	2,898	118.40
మొత్తం	4,944	236.09